నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల
3 | కరీంనగర్, శనివారం 9 మార్చి 2024 | RAJANNA SIRCILLA



వెల్గటూర్ : కోటిలింగాల వద్ద గోదావరి నదిలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



వేములవాడలో మహాలింగార్చన నిర్వహిస్తున్న వేద పండితులు



# శివోహం

## వైభవంగా మహా శివరాత్రి వేడుకలు

వేములవాడ ఆలయం ఎదుట పెద్ద సంఖ్యలో భక్తులు



కమాన్ చౌరస్తా: కరీంనగర్ పాతబజార్ శివాలయంలో భక్తుల పూజలు

- శివ నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రాలు
- భక్తులతో పోటెత్తిన ఆలయాలు
- వేములవాడకు 2లక్షల మందికిపైగా రాక
- కనులపండువగా మహాలింగార్చన
- అర్ధరాత్రి ఘనంగా లింగోద్భవ వేడుక
- అలరించిన శివార్చన

**'హరహర మహాదేవ..' 'శంభోశంకర..' అంటూ శివనామస్మరణతో ఉమ్మడి జిల్లాలోని శైవక్షేత్రాలు మార్మోగాయి. శుక్రవారం మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా వేములవాడ రాజన్న క్షేత్రం 2 లక్షల మందితో పోటెత్తింది. ఎటు చూసినా జనసందోహమే కనిపించింది. కాగా, అనువంశిక అర్చక కుటుంబాలకు చెందిన అగ్రహార బ్రాహ్మణులతో ఆలయంలోని అద్దాల మండపంలో 'మహాలింగార్చన', అర్ధరాత్రి 11 మంది రుత్వికులతో లింగోద్భవ ఘట్టాన్ని నిర్వహించగా, భక్తులు తిలకించి పులకించిపోయారు. పలుచోట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు శైవ క్షేత్రాలకు వెళ్లి పూజలు చేశారు.**

**- వేములవాడ టౌన్, మార్చి 8**

మహాశివరాత్రి సందర్భంగా శైవక్షేత్రాలు పోటెత్తాయి. వేలాది మంది భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఉమ్మడి జిల్లాలోని వేములవాడ రాజన్న, సారంగాపూర్‌లోని దుబ్బరాజన్న, కరీంనగర్ పాత బజార్ శివాలయం, గోదావరిఖని శివారులోని జనగామ శ్రీ త్రిలింగ రాజరాజేశ్వర స్వామి, కోటిలింగాల ఆలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మోగాయి. వేములవాడ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి ఈ ఒక్కరోజే సుమారు 2లక్షల మందికిపైగా తరలివచ్చారు. రాయేశుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. తలనీలాలతోపాటు బంగారం(బెల్లం) మొక్కులను కూడా సమర్పించారు. గంటలపాటు క్యూలో నిల్చుండి స్వామివారిని దర్శించుకున్నారు. కాగా, భక్తుల రద్దీ దృష్ట్యా గర్భగుడిలో అధికారులు ఆర్జిత సేవలను రద్దు చేశారు. సాయంత్రం పట్టణంలోని అనువంశిక అర్చక కుటుంబాలకు చెందిన అగ్రహార బ్రాహ్మణులతో ఆలయంలోని అద్దాల మండపంలో మహాలింగార్చనను వైభవంగా నిర్వహించారు. 366 లింగాలు, 366 జ్యోతులను అలంకరించి వేదమంత్రాలతో పూజలు చేశారు. దాదాపు రెండున్నర గంటలపాటు కార్యక్రమం జరుగుతున్నంత సేపు భక్తులు శివనామ స్మరణ చేశారు. ఆలయ స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్ ఆధ్వర్యంలో దాదాపు 128 కుటుంబాలకు చెందిన బ్రాహ్మణులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే రాత్రి 11.30 గంటలకు లింగోద్భవకాలంలో ఆలయ గర్భగుడి ముందు 11మంది రుత్వికులతో మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. రాత్రి 7 గంటల నుంచి శివార్చనను నిర్వహించారు.





మంథని : శ్రీభిక్షేశ్వరాలయంలో పూజలు చేస్తున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



సైదాపూర్ : ఎక్లాస్‌పూర్ శివాలయంలో పూజలు చేస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్



చిగురుమామిడి : పొట్లపల్లిలో పూజలు చేస్తున్న మాజీ ఎంపీ వినోద్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సతీశ్ కుమార్



ధర్మారం : నంది మేడారంలోని అమరేశ్వరాలయంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ స్నేహలత దంపతుల పూజలు



ఎండిన పంటపొలాలన్ని పరిశీలిస్తున్న ముంజంపల్లి రైతులు



ఎండిన వరిని మేస్తున్న ఎద్దులు

# ఎండుతున్న పంటలు

- ముంజంపల్లి, మారేడుపల్లి పరిధిలో సాగునీరందక నెర్రెలు
- పొట్ట దశలో బీటలు వారుతున్న పొలాలు
- పట్టని అధికారులు.. నీళ్లడిగితే బెదిరింపులు
- కేసీఆర్ పాలనలో ఇలాంటి పరిస్థితి లేదంటున్న రైతులు
- కొత్త సర్కారు పట్టించుకోవాలని వేడుకోలు

**గతేడాది మాదిరిగానే సాగునీరందుతుందని ఆశించిన ఎండపల్లి మండలం ముంజంపల్లి, మారేడుపల్లి రైతుల ఆశలు అడియాశలయ్యాయి. సాగునీరు లేక వందల ఎకరాల్లో పంటలు ఎండుతున్నాయి. ఎక్కడికక్కడ పొలాలు నెర్రెలు బారి, పొట్ట దశలో చేతికి రాకుండా పోతున్నాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాడు కేసీఆర్ పాలనలో ఏ రంది లేకుండా పంటలు సాగు చేసుకున్నామని, ఈ సారి అంతా మునుగుడే అయితదని వాపోతున్నారు. అధికారులు పట్టించుకోవడం లేదని, నీళ్లివ్వాలని అడిగితే కేసులు పెడుతామని బెదిరిస్తున్నారని మండిపడుతున్నారు. ఇలా అయితే తమ సమస్యను ఎవరికీ చెప్పకునేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి సాగునీరందించాలని, పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు.**

వెల్గటూర్, మార్చి 8 : గతేడాది మాదిరిగానే ఈ యాసంగిలో కూడా ఏ రందీ లేకుండా సాగు చేసుకోవచ్చని అన్నదాతలు భావించారు. ఎస్సారెస్పీ లేదా పంప్‌హౌస్ ద్వారా నీళ్లు వస్తాయన్న గంపెడాశతో దాదాపు 820 మంది రైతులు ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాల పరిధిలో 1800 ఎకరాల్లో వరి వేశారు. మెజార్టీ రైతులు ఎస్సారెస్పీ కాలువ (డీ83 ఉపకాలువ 11ఎల్)తోపాటు బావులపై ఆధారపడి సాగు చేశారు. అయితే మొదట్లో తెగుళ్లు రావడంతో పంట పొలాలను కాపాడుకునేందుకు తంటాలు పడ్డారు. అప్పుడు వేలాది రూపాయలు ఖర్చు పెట్టి, మందులు పిచికారీ చేశారు. తీరా ఇప్పుడు పంటలు పొట్ట దశకు చేరుకున్న సమయంలో సాగునీరు అందకపోతుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఎస్సారెస్పీ కాలువ నుంచి నీళ్లు రాకపోవడంతో ఆగమవుతున్నారు. కేసీఆర్ సర్కారు ఉన్నప్పుడు యాసంగికి వారబంధీ ద్వారా సాగునీరు ఇచ్చేవారు. ఒక వేళ కాలువ ద్వారా నీళ్లివ్వని పరిస్థితుల్లో మారేడుపల్లి పక్కనే ఉన్న వేంనూర్ పంప్‌హౌస్ నుంచి నంది రిజర్వాయర్‌కు నీటిని తరలించే పైప్‌లైన్‌కు ఉన్న వాల్వ్‌ను ఓపెన్ చేసి ఎస్సారెస్పీ 11ఎల్ కాలువలోకి వదిలేవారు. ఇలా నీరు సరఫరా చేసి పంటలు ఎండకుండా కాపాడారు. కానీ, ప్రస్తుతం ఎక్కడి నుంచి కూడా నీళ్లచ్చే పరిస్థితి లేదు. గతంలో యాసంగికి వారబంధీ ద్వారా ఈ పంటలకు నీరిచ్చినా.. ఈ సారి ఈ రెండు గ్రామాలకు రావడం లేదు. ఎస్సారెస్పీ ద్వారా చొప్పదండి రేవెళ్లి వద్ద ఓసీ పాయింట్ నుంచి డీ83 కెనాల్‌కు 1800 క్యూసెక్కులు రావాల్సి ఉన్నా.. 1100 క్యూసెక్కులకు మించి ఇవ్వడం లేదు. దీంతో నీటిని డిస్ట్రిబ్యూటర్లకు తరలించడంలో ఇబ్బందులు ఎదురవుతుండగా, చివరి ఆయకట్టులో పంటలు దెబ్బతింటున్నాయి. ఇప్పటికే దాదాపు 100 మంది రైతులకు చెందిన 300 ఎకరాలు పొట్టదశలో ఎండిపోయాయి. పొలాలు బీటలు వారుతున్నాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్ వచ్చే నాటికి పరిస్థితి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చేస్తున్నారు.



నంది రిజర్వాయర్‌కు నీరును తరలించే పైప్ లైన్ వాల్వ్

### లింక్ కెనాల్‌పై పట్టని ప్రభుత్వం

ఎండపల్లి మండలంలో సాగునీటి సమస్యను శాశ్వత పరిష్కారం చూపాలన్న ఉద్దేశ్యంతో నాడు మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ ప్రత్యేక చొరవ చూపారు. నంది రిజర్వాయర్ నుంచి రెండు కిలో మీటర్ల గ్రావిటీ కెనాల్‌ను తవ్వి, ఖిలావనపర్తి దగ్గర ఎస్సారెస్పీ 11ఎల్‌కు కలుపాలని నిర్ణయం తీసుకున్నారు. తెలంగాణ తొలి సీఎం కేసీఆర్, అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు సహకారంతో ₹8.55 కోట్లు నిధులు మంజూరు చేయించారు. కానీ, ఎన్నికలు రావడంతో ఆ పనులు జరగలేదు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం దీనిపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో కాలువ నిర్మాణం జరుగుతుందా..? లేదా..? అన్న అనుమానం రైతుల్లో నెలకొన్నది.

### తాగడానికి కూడా నీళ్లు కరువైనయి

గతంలో కాళేశ్వరం నీటిని ఎత్తిపోసి ఏడాది పొడువునా గోదావరినదిలో నీళ్లు నిల్వ చేసిన్రు. అప్పుడు భూగర్భ



జలాలు పైకొచ్చినయి. తాగు, సాగు నీటికి ఇబ్బందులు లేకుండె. ఇప్పుడు గోదావరి నీళ్లు లేవు. భూగర్భజలాలు కూడా అడుగంటుతున్నయి. నీళ్లు లేక పంట పొలాలు ఎండుతున్నయి. కనీసం పశువులు తాగడానికి కూడా నీళ్లు కరువైనయి. పశువులకైనా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలి.

**- కొమ్ము సంజీవ్, రైతు (మారేడుపల్లి**

### ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవాలి

నాకున్న ఎకురం ఉన్నది. గతేడాది మాదిరిగా నీరందుతుందని ఆశపడి ఎకరాకు రూ.12 వేలు చెల్లించి మరో రెండున్నర ఎకరాలు కౌలుకు తీసుకున్న. మొత్తం మూడున్నర ఎకురాల్లో పొలం వేసిన. ఇప్పుడు నీళ్లందక పొలాలు ఎండుతున్నయి. మా పక్కనే వేంనూర్ పంపౌజ్, ఎల్లంపల్లి ప్రాజెక్టు ఉన్నది. కానీ, మాకు సాగునీరు అందుత లేదు. ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవాలి. మాకు శాశ్వత పరిష్కారం చూపాలి. నీళ్లు రాకపోతే పంటలు పోతయి. పెట్టుబడులు ఎళ్లక మేం అప్పులపాలైతం.

**- బైరం మధు, కౌలు రైతు (ముంజంపల్లి)**

# నేతన్నను ఆదుకోవాలి

- **ఈ నెల 14లోగా బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వాలి**
- **₹200 కోట్ల పాత బకాయిలు చెల్లించాలి**
- **లేదంటే 15న సిరిసిల్లలో నేతన్నలతో మహాధర్నా చేస్తాం**
- **కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, వినోద్‌కుమార్**



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్

రాజన్న సిరిసిల్ల, మార్చి 8 (నమస్తే తెలంగాణ)/ సిరిసిల్ల టౌన్: నేతన్నకు బతుకుదెరువుగా నిలిచిన బతుకమ్మ చీరల ఆర్డర్లు, పెండింగ్‌లో ఉన్న ₹200కోట్ల బకాయిలు ఈ నెల 14లోపు చెల్లించాలని కరీంనగర్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి, బీ వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నేతన్నల విషయంలో వెంటనే నిర్ణయం తీసుకోకుంటే ఈ నెల 15న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వేలాది మంది నేతన్నలతో సిరిసిల్లలో మహాధర్నా చేస్తామని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డిది కార్మిక వ్యతిరేక ప్రభుత్వమని తెలంగాణ ప్రజలకు ధర్నా ద్వారా తెలియజేస్తామని స్పష్టం చేశారు. అందులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పాల్గొంటారని చెప్పారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రంలో సిరిసిల్ల పవర్‌లూం కార్మికులకు బతుకుదెరువు కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ వస్త్రాలు, ఆర్వీఎం స్కూల్ యూనిఫాంల తయారీకోసం ఆర్డర్లు ఇచ్చి ఆదుకున్నదన్నారు. కానీ, కాంగ్రెస్ సర్కారు బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వకుండా నేతన్నల పొట్టగొడుతున్నదని, గతంలో తయారు చేసిన వస్త్రాలకు సంబంధించి ₹200 కోట్లు విడుదల చేయక పోవడంతో యజమానులు, ఆసాములు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. తెచ్చిన అప్పులు కట్టలేక సాంచాలు బందపెట్టారని, ఫలితంగా కార్మికులంతా పనిలేక రోడ్డున పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నేత కార్మికులకు అన్యాయం చేయవద్దని, వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాక ముందు సిరిసిల్ల ఉరిసిల్లగా మారితే నాడు ఉద్యమ సమయంలో ఎంపీగా ఉన్న కేసీఆర్ జోలె పట్టి చందాలు పోగు చేసి ₹50లక్షలు పద్మశాలీ ట్రస్టుకు అందించి ఆదుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. కేసీఆర్ సర్కారు హయాంలో నేత కార్మికులకు ₹3400 కోట్ల ఆర్డర్లు ఇచ్చినట్లు చెప్పారు. 'కత్తెర పెడతాం.. పేగులు మెడలో వేసుకుంటాం' అని సీఎం స్థాయిలో ఉన్న రేవంత్‌రెడ్డి మాట్లాడడం పద్ధతి కాదని, ప్రజాస్వామ్యంలో వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఇంట్లాంటి మాటలు మాట్లాడవద్దని హితవు పలికారు. రాష్ట్రాన్ని ఎలా అభివృద్ధి చేయాలో ఆలోచించాలే కానీ, పనికి మాలిన మాటలు మాట్లాడవద్దని సూచించారు.

### కేకేకు ధైర్యముంటే బకాయిలు ఇప్పించాలి

కాంగ్రెస్ నేత కేకే మహేందర్‌రెడ్డికి ధైర్యముంటే సీఎం వద్దకు వెళ్లి కార్మికులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయించాలని, మళ్లీ బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇప్పించాలని వినోద్ కుమార్ సూచించారు. 'ఇన్నాళ్లు సిరిసిల్ల నేత కార్మికులు బాగా దొబ్బితిన్నారంటూ' ఆయన మాట్లాడడం సరైంది కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్డర్లను రద్దు చేస్తామని అనడం ఏంటని, ప్రభుత్వం సిరిసిల్లకు ఆర్డర్లు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. ఇక్కడి నేతన్నల దయనీయ పరిస్థితి చూసైనా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు బకాయిలు విడుదల చేస్తారని ఆశిస్తున్నామన్నారు. కానీ, బకాయిలు విడుదల చేయాలని మంత్రి తుమ్మలను అడిగితే, కేకేను వెంట తీసుకొనిరమ్మనడంలో ఆంతర్యమేమిటని, రాజకీయాలకు బకాయిల చెల్లింపులకు సంబంధం ఏంటని ఫైరయ్యారు.

### నేతన్నలను ఆదుకున్నది కేసీఆర్ ప్రభుత్వమే

తెలంగాణ వచ్చిన తర్వాత నేత కార్మికులను బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకుదెరువు చూపిందని, బతుకమ్మ చీరలు, రంజాన్, క్రిస్మస్ వస్త్రాల తయారీ ఆర్డర్లు ఇచ్చి జీవితాల్లో వెలుగులు నింపిందని వినోద్‌కుమార్ గుర్తు చేశారు. ఒకప్పుడు ఇక్కడి నేత కార్మికులు బతుకు దెరువు కోసం షోలాపూర్, సూరత్, భీవండీ లాంటి ప్రాంతాలకు వలస పోయేవారని, కానీ, రాష్ట్రం వచ్చాక కేసీఆర్ సర్కారు ఇచ్చిన ప్రోత్సాహం, చూపిన బతుకుదెరువుతో ఎంతో మంది వాపస్ వచ్చారని చెప్పారు. 2001నుంచి 2008 దాకా సిరిసిల్లలో ఎక్కడ చూసినా నేత కార్మికుల ఆత్మహత్యలే కనిపించేవని, నాడు కార్మికుల బతుకులు అత్యంత దారుణంగా ఉండేవని పేర్కొన్నారు. నాడు ఎంపీగా ఉన్న కేసీఆర్ నేతన్నలకు ఎంతో ధైర్యం చెప్పారని, ఆయన ఆర్డర్లు ఇచ్చి ఆదుకోవడం వల్లే ఆత్మహత్యలు ఆగిపోయాయన్నారు. బీఆర్ఎస్ సర్కారు నేత కార్మికులకు చేతి నిండా పని, పనికి తగ్గ వేతనం పొందేలా బతుకమ్మ చీరల ఆర్డర్లు ఇవ్వడమే కాకుండా పదిశాతం యారన్ సబ్సిడీ ₹36కోట్లు కూడా ఇచ్చినట్లు వివరించారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, మాజీ టెక్స్‌టైల్స్ కార్పొరేషన్ చైర్మన్ ప్రవీణ్, జగిత్యాల జడ్పీ వైస్‌చైర్మన్ హరిచరణ్‌రావు, రాష్ట్ర నాయకులు చీటి నర్సింగరావు, బొల్లి రాంమోహన్, రాజన్న, మల్లారెడ్డి, అగ్గిరాములు, జక్కుల నాగరాజు, రాజునాయక్ పాల్గొన్నారు.

### బకాయిలే ఇస్త లేరు.. హామీలెలా నెరవేరుస్తరు?

కాంగ్రెస్ సర్కారు నేతన్నలకు ఇవ్వాల్సిన బకాయిలే విడుదల చేయడం లేదు. ఇక మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలు ఎలా నెరవేరుస్తుంది. జగిత్యాల, నారాయణరావుపేట, భువనగిరిలలో పవర్‌లూం క్లస్టర్లు ఏర్పాటు చేసి 90శాతం సబ్సిడీ ఇస్తామని ప్రకటించిన్రు. కానీ, ఎప్పుడు చేస్తారో చెప్పాలి. ఉన్న ఆర్డర్లే ఇవ్వడం లేదు, బకాయిలు చెల్లించడం లేదు. ఇచ్చిన హామీలు నెరవేరుస్తారన్న నమ్మకం ఏంటి?. సిరిసిల్లకు ఆర్డర్లు ఇవ్వకుండా కమీషన్లు దొబ్బితినడానికి షోలాపూర్, భీవండీ, సూరత్‌కు ఇచ్చే ప్రయత్నం చేస్తున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నయ్.

**-వినోద్ కుమార్**